క్లుప్తంగా

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి ఎగ్జిట్ ఇవ్వాలి

చింతకాని: దేవరపల్లి నుంచి సూర్యాపేట వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ధంసలాపురం గ్రామం వద్ద ఎగ్జిట్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఖమ్మం కార్పొరేటర్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన భట్టి జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి ధంసలాపురం వద్ద ఎగ్జిట్ ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, మదూరి ప్రసాద్, కొత్తపల్లి నీరజ, మందడపు మనోహర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపీ, తిరుపతి గోవింద రావు, బందెల నాగార్జున్, ఓర్సు వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, పొలిటికల్ సైన్స్ బోధించేందుకు ఆసక్తి, అర్హతలు ఉన్నవారు మంగళవారం సాయంత్రం నాలుగు గంటల్లోగా లోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అనంతరం 4వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే పీజీలో 50 శాతం, ఇతర అభ్యర్థులకు 55 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్‌తో బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు.

షాపు విషయమై మహిళ ఆందోళన

కారేపల్లి: కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లోని సాయిలు మాస్టర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపు విషయమై మహిళ, ఆమె కుటుంబ సభ్యులు కిరోసిన్ డబ్బాతో ఆదివారం ఆందోళనకు దిగారు. కాంప్లెక్స్‌లో ఒక షాపు తమదని, ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారికి తాకట్టు పెట్టి డబ్బు తీసుకున్నామని సదరు మహిళ వెల్లడించింది. ప్రస్తుతం అప్పు చెల్లిస్తామన్నా షాపు ఇచ్చేందుకు నిరాకరిస్తుండడంతో ఆందోళనకు దిగినట్లు తెలిపారు. అయితే, వ్యాపారి మాత్రం షాపును తనకు అమ్మేశారని, ప్రస్తుతం కేసు కోర్టులో నడుస్తోందని చెబుతున్నాడు. సదరు మహిళ, ఆమె కుటుంబీకులు ఉదయం నుంచి రాత్రి వరకు షాపు ముందే నిరసన తెలుపుతుండగా, పోలీసులు సర్దిచెప్పినా వినకపోవటంతో ఉద్రిక్తత నెలకొంది.

ఆర్‌ఎంపీలపై దాడులు తగవు

పెనుబల్లి: గ్రామీణ వైద్యులపై చేస్తున్న దాడులను గ్రామీణ వైద్యులంతా కలిసి ఎదుర్కోవాలని ఆర్‌ఎంప్ డబ్ల్యూఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని కొండలరావు, బోయినపల్లి శ్రీనివాసరావులు అన్నారు. ఆర్‌ఎంపీ వైద్యులు ప్రాథమిక చికిత్స మాత్రమే చేసి ఎమర్జెన్సీ కేసులను వెంటనే పెద్దాసుపత్రులుకు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు విఠల్ మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీలకు సీఐటీయూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీ వైద్యుల సంఘ నాయకులు కృష్ణ మోహన్, షేక్ నాగుల్‌మీర, కాంతారావు, బొర్రా కనకారావు, లక్ష్మయ్య, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'దోస్త్' రిజిస్ట్రేషన్లకు 2వ తేదీ వరకు గడువు

సత్తుపల్లిటౌన్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దోస్త్ మూడో దశ రిజిస్ట్రేషన్లకు ఈ నెల 2వ తేదీతో గడువు ముగుస్తుందని సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. వివిధ కోర్సులకు వెబ్ ఆప్షన్లు, 3వ తేదీ వరకు ఇవ్వొచ్చన్నారు. డిగ్రీ ప్రవేశ రుసుము రూ.400, ఈ నెల 6వ తేదీన 3వ దశ సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఆధార్ అనుసంధానం చేసిన స్మార్ట్ ఫోన్ ఉంటే దానితో నేరుగా దోస్త్ వెబ్‌సైట్‌లో సులభంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. ఇటీవల సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'మన్‌కీబాత్'ను వీక్షించిన నాయకులు

సత్తుపల్లిటౌన్: మూడోసారి ప్రధాని అయిన నరేంద్రమోదీ తొలిసారిగా నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో బీజేపీ నాయకులు వీక్షించారు. అనంతరం విద్యార్థులు, యువకులు, కార్యకర్తలతో కలిసి బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో అందరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, పట్టణ అధ్యక్షుడు ఆచంటి నాగస్వామి, రహీంతుల్లా, సుబ్రమణ్యం, నర్సింహామూర్తి, శేషగిరిరావు, కార్తీక్, అశోక్, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాల నిర్వహణకు అనుకూలంగా ఉన్న తల్లాడ జిల్లా పరిషత్ పాఠశాల భవనం

కలగానే.. కళాశాల

తల్లాడలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటుకు విన్నపాలు
- అమలుకు నోచుకోని పాలకుల హామీ
- విద్యార్థులకు భారంగా మారిన 'ప్రైవేట్' ఫీజులు
- మధ్యలోనే చదువు మానేస్తున్న పలువురు


ప్రస్తుతం ఆక్రమణలో ఉన్న కళాశాల స్థలం

తల్లాడ: విద్య ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు.. పాలకులు పదే పదే చెబుతున్నా తల్లాడకు మాత్రం అందులో మొండిచేయి చూపిస్తుంది. తల్లాడ మండలంలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యకు నోచుకోవడం లేదు. ఇక్కడ అనేక ప్రైవేట్ కళాశాలలు ఉన్నా.. అందులో విద్యను అభ్యసించే స్తోమత లేక 10వ తరగతి పూర్తి చేసిన ప్రతిభగల పేద విద్యార్థులు మధ్యలోనే విద్యను ఆపేస్తున్నారు. కొందరు ఖమ్మం, వైరా, ఇతర ప్రాంతాలతో పాటు స్థానిక ప్రైవేట్ కళాశాలలకు వెళ్లాల్సి వస్తుంది. గత నాలుగు దశాబ్దాలుగా మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ప్రతీ సంవత్సరం మండలం నుంచి సుమారు 500 వందల మంది విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణులై ప్రైవేట్ కళాశాలలకు వెళ్తున్నారు.

ఆక్రమణకు గురైన స్థలం..

40 సంవత్సరాల క్రితమే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు మల్లవరం సమీపంలోని 170 సర్వే నంబర్‌లో రెండెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. స్థలాన్నైతే కేటాయించింది కానీ కళాశాలను మంజూరు చేయలేదు. దీంతో ఈ స్థలం ఖాళీగా ఉంది. ఈ క్రమంలో పలువురు మూడు దశాబ్దాల క్రితం ఆక్రమించుకొని వరిపంట పండిస్తున్నారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఆక్రమణదారులకు నోటీసులు పంపగా.. వారు కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి కేసు కోర్టులో నడుస్తూనే ఉంది. ప్రస్తుతం ఆ భూమిలో రైతులు వరిసాగు చేసుకుంటున్నారు.

మంత్రులను కలిసిన పూర్వ విద్యార్థులు..

తల్లాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విషయమై పూర్వ విద్యార్థులు 2017లో అప్పటి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, విద్యాశాఖా మంత్రి కడియం శ్రీహరిలను కలిశారు. ఈ సందర్భంగా మంత్రులిద్దరూ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ విద్యా సంవత్సరమే కళాశాల ఏర్పాటు చేయాలని కోరగా.. మంత్రులు అంగీకరించినా సాంకేతిక పరమైన సమస్యల కారణంగా అది సాధ్యం కాలేదు. ఇక అప్పటి నుంచి తల్లాడలో కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు తమ పార్టీ మేనిఫెస్టోలో కళాశాల ఏర్పాటు చేస్తామని పెడతారు. ఆ తర్వాత దాని ఊసే కూడా ఎత్తరు.

విద్యా సంవత్సరంలో ఏర్పాటు చేయాలి..

ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైనందున తల్లాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేసి.. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో భవనాలు నిర్మించాలని మండల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. తాత్కాలికంగా షిఫ్ట్ పద్ధతిలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా కళాశాల ఏర్పాటు చేయవచ్చు. అధునాతన భవనాలతో జాతీయ రహదారి పక్కనే పాఠశాల ఉంది. ఉదయం హైస్కూల్ సెక్షన్, మధ్యాహ్నం నుంచి కళాశాల తరగతులు నిర్వహించేందుకు అనుకూలంగా ఉంది. హైస్కూల్ పక్కనే ఎన్ఎస్‌పీ స్థలం ఉంది. కళాశాల మంజూరైతే ఎన్ఎస్‌పీ స్థలాన్ని కళాశాల కింద ఉపయోగించుకోవటానికి అనుకూలంగా ఉంటుంది. ఆ తర్వాత సొంత భవనం నిర్మించవచ్చు. పాలకులు, అధికారులు ఈ దిశగా ఆలోచించాలని మండల వాసులు ముక్త కంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి..


తల్లాడలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి. ఎప్పటి నుంచో ఈ ప్రాంత వాసులు ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం ఎన్నో అర్జీలు, విన్నపాలు పెట్టుకున్నారు. 2017లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రులను కలవగా వారు హామీ ఇచ్చారు.
– నెమ్మకంటి దామోదరప్రసాద్, ఎంఈఓ, తల్లాడ

సౌకర్యంగా ఉంటుంది..


కళాశాల ఏర్పాటు చేస్తే ప్రభుత్వ పాఠశాలలో చదివే మా లాంటి పేద విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. ఈ ఏడాది కళాశాల ఏర్పాటు అవుతుందని భావించాము. అది నిజం కాలేదు. ప్రభుత్వ కళాశాల లేకపోవడం వల్ల చదువులు అర్ధాంతరంగా ఆగి పోతున్నాయి.
– వేముల నందిని, విద్యార్థిని, బిల్లుపాడు

పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి


ఏన్కూరు: మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు


తల్లాడ: గంగదేవిపాడు సొసైటీలో..


పెనుబల్లి: మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు

తల్లాడ/కల్లూరురూరల్/పెనుబల్లి/ఏన్కూరు: ఒక కుంట నుంచి పది ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా అందించాలని రైతులు తెలిపారు. తల్లాడలోని గంగదేవిపాడు సొసైటీలో అధ్యక్షుడు తూము బీరభద్రరావు అధ్యక్షతన, కల్లూరులోని విశాల సహకార పరిమితి సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు బోబోలు లక్ష్మణరావు ఆధ్వర్యంలో, పెనుబల్లి రైతు వేదికలో సొసైటీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు ఆధ్వర్యంలో.. ఆదివారం రైతు భరోసా పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. పెనుబల్లిలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కోఆపరేటివ్ జాయింట్ రిజిస్ట్రార్ నాయక్ హాజరై.. రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అదే విధంగా ఏన్కూరులో స్థానిక సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు శెట్టిపల్లి వెంకటేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన మహాజన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూమి ఉండి పట్టాలు లేని రైతులకు ఈ పథకం అమలు చేయలన్నారు. ఈ సదస్సులలో పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ సలహాలు, సూచనలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రైతుబంధు అమలు చేయాలన్నారు. 2018 నుంచి మొదలైన రైతుబంధు మొదట 400, తర్వాత 500 ఎకరాల చొప్పున ఇచ్చారని.. ప్రస్తుతం పదెకరాల వరకు అందించాలని కోరారు. అదే విధంగా కౌలు రైతులకు కూడా రైతుభంధు అందించాలని, రైతులు ఎంత పొలం సాగుచేస్తే అంతవరకు మాత్రమే రైతుబంధు అందించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో రైతులందరికీ పట్టాదారు పాసు పుస్తకాలు లేవని, వ్యవసాయ శాఖ ద్వారా సాగు చేస్తున్న రైతు లందరిని గుర్తించి రైతు భరోసా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాలల్లో సొసైటీ డైరెక్టర్ వీరాంజనేయులు, బుద్ధిసాగర్, రమేష్‌బాబు, బ్రహ్మం, లక్ష్మీదేవి, రవి, సీఈఓ రాకేష్, ఏఈఓ త్రివేణి, డీఆర్ ఏఓ నీరజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీదేవి, కల్యాణి, శంకర్, ఏఓ రూప, సీఈఓ బీరవల్లి శ్రీనివాసరావు, రైతులు రైతులు లక్కినేని రఘు, జాస్తి శ్రీనివాసరావు, దరావత్ మోహన్, నందిగామ ప్రసాద్, రవి సూర్యనారాయణ, యాచవరపు వెంకటేశ్వరరావు, దామాల రాజు, పెద్దబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ గోపిరెడ్డి, బుర్రి వీరయ్య, ఉబ్బెన బాబురావు, ఉబ్బన కరుణాకర్, పెనుబల్లిలో.. సొసైటీ సీఈఓ పెరుమాళ్ల విజయ్, జెడ్పీటీసీ మోహన్‌రావు, వ్యవసాయశాఖ అధికారి రాజు, సొసైటీ డైరెక్టర్లు గాయం నాగరాజు, బొర్రా వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ ,స్థానిక రైతులు చీకటి రామారావు, పంది వెంకటేశ్వరరావు, బొర్రా మల్లయ్య, బాపిరెడ్డి, మందడపు నరసింహారెడ్డి, ఏన్కరులో.. కో ఆపరేటివ్ వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ నీరజ, ఖమ్మం కోఆపరేటివ్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ శిదేవి, శంకర్, కల్యాణి, తిరుమలరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం


ఆక్సిజన్ పరికరాన్ని అందజేస్తున్న క్లబ్ నిర్వాహకులు

సత్తుపల్లి: ప్రపంచ వ్యాప్తంగా సమాజసేవలో లయన్స్‌క్లబ్ ముందంజలో ఉంటుందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ సీహెచ్ శివప్రసాద్ అన్నారు. ఆదివారం సత్తుపల్లి కళాభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోనే మిల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం 220 రోజుల పాటు సత్తుపల్లిలో పేదలకు ఉచిత అల్పాహారం అందించారని తెలిపారు. అదే విధంగా 112 మంది మృతుల నుంచి నేత్రాలను సేకరించి వాటిని 200మందికి అమర్చి చూపు ప్రసాదించటంలో పెనుగొండ రమేష్ కృషి చేశారన్నారు. ఏడాది కాలంగా లయన్స్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన దొడ్డా కృష్ణయ్య, పెనుగొండ రమేష్, కోశాధికారి గుండు శ్రీనివాసరావులను సత్కరించారు. అనంతరం సత్తుపల్లి లయన్స్‌క్లబ్ సంస్థ ద్వారా రూ.లక్ష విలువైన ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్‌ను ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరానికి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శులుగా పెనుగొండ రమేష్, దాసరి ఉమామహేశ్వర రెడ్డి, సింగరేణి రవి ఎన్నిక కాగా.. వీరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆషా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ మట్టా దయానంద్, లయన్స్ క్లబ్ బాధ్యులు దారా కృష్ణారావు, గంధ్ర సోమిరెడ్డి, ప్రభాకర్‌రావు, మందపాటి ప్రభాకర్‌రెడ్డి, తోట రమేష్, కొత్తూరు సత్యనారాయణ, జంగా సత్యనారాయణ, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక


నూతన కమిటీకి అభినందనలు తెలుపుతున్న రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

బోనకల్: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి చిలకా నాగేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా తోటపల్లి చిన్న సైదులు, ఉపాధ్యక్షుడిగా మరికంటి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా తళ్లూరు ప్రకాశరావుతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ 30సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గ్రామంలో జులై 7న జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రావ్, జ్యోతీరావ్‌పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట హనుమంతరావు, తాటికొండ వెంకటరత్నం, సాల్మన్, గద్దల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను ప్రజలే కాపాడుకోవాలి

ఎర్రుపాలెం: ప్రభుత్వ పాఠశాలలను ప్రజలే కాపాడుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. ఆదివారం మండలంలోని చొప్పకట్లపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బండారుపల్లి రాజారావు పదవీ విరమణ సన్మానికి హాజరైన సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సుతారి మేస్త్రీల సమావేశం

మధిర: మధిరలో సుతారి మేస్త్రీల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాలేశ్వరరావు, జక్రేష్, రమణ, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు

వేంసూరు: మండల పరిధిలోని రామన్నపాలెం శ్మశాన వాటికకు వెళ్ళే రహదారి శనివారం, ఆదివారం కురిసిన వర్షానికి అధ్వానంగా తయారైంది. దీంతో రామన్నపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ మట్టా దయనంద్, యువసేవ సభ్యుడు కుప్పిరెడ్డి, సీతా రెడ్డిలు తమ సొంత ఖర్చులతో రహదారిపై నిలిచిన నీటిని జేసీబీతో తొలగించి, రాకపోకలకు వీలుగా ఉండే విధంగా మరమ్మతులు చేశారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం


బురదమయంగా మారిన కొణిజర్ల - బస్వాపురం రోడ్డు

కొణిజర్ల: మండల కేంద్రం నుంచి చింతకాని వరకు నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా బస్వాపురం సమీపంలో లో లెవల్ చప్టా ప్రాంతంలో కొత్తగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. దీనిలో భాగంగా బ్రిడ్జికి సమాంతరంగా మట్టి పోయడంతో గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వానలకు మట్టి రోడ్డు బురద మయంగా తయారైంది. కొణిజర్ల నుంచి ప్రొద్దుటూరు, పెద్ద గోపతి రూట్‌లో దాదాపు 20 గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదనే తిరుగుతుంటారు. దీంతో వాహనదారులు బురదలో ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేస్తున్నారు. ద్విచక్రవాహనదారులు జారి కింద పడిపోతున్నారు. రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్ రోడ్డుపై సన్న కంకర లేదా రాక్ శాండ్ పోయించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేంసూరు: వేంసూరు గ్రామంలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అంకురావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చివరి వరకు పోరాడేది కమ్యూనిస్టులే


మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

వైరారూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం చివరి వరకు పోరాడేది కమ్యూనిస్టులేనని ఆ పార్టీ సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం అన్నారు. మండలంలోని పాలడగు గ్రామంలో నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం రెండో రోజుకు చేరుకోగా ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తేనే సీపీఎం బలబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, తూము సుధాకర్, తోట నాగేశ్వరరావు, వనమా చిన్న సత్యనారాయణ, షేక్.మజీద్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడికి గాయాలు

ముదిగొండ: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికుడికి గాయాలైన సంఘటన ముదిగొండ మండలం ముత్తారంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వనంవారి కిష్టాపురానికి చెందిన సోమగాని శంకర్‌గౌడ్ ముత్తారంలోని తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు తాటిచెట్టుపైనుంచి జారీ కిందపడ్డాడు. దీంతో అతని రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు తీవ్రగాయాలైయ్యాయి. అతనికి వైద్యకోసం 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కళావతి సేవలు అభినందనీయం

పెనుబల్లి: లంకాసాగర్ పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసి ఆదివారం పదవీ విరమణ పొందిన కళావతి సేవలు అభినందనీయమని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కిరణ్ అన్నారు. పెనుబల్లి మండల పరిధిలోని అడవిమల్లేల పీహెచ్‌సీ సెంటర్‌లో ఆదివారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కళావతి పదవీ విరమణ సందర్భంగా ఆమెను పూలమాలలు, శాలువాలతో పీహెచ్‌సీ సిబ్బంది సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సౌమ్య, హెచ్‌ఈవో శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రకాశ్‌రావు, నాగేశ్వరరావు, పాటిమ్మ, నిర్మల కుమారి, ఏఎన్ఎంలు వర లక్ష్మి, మంగతయారు, ఇస్లాత్ బేగం, కుమారి, శాంతమ్మ, కృష్ణకుమారి, కల్పన, త్రివేణి, నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులు పోరాడాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకన్న

సత్తుపల్లిరూరల్: ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను పాలకులు పెట్టుబడి దారి వర్గాల ఒత్తిడి తలొగ్గి రద్దు చేయడానికి పన్నుతున్న కుట్రలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న అన్నారు. ఆదివారం సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లిలో ఐఎఫ్‌టీయూ నాయకుడు అమర్లపూడి శరత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో.. అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్న కారల్ మార్క్స్ సిద్ధాంతానికి కట్టుబడి కార్మికవర్గం చైతన్యవంతంగా పోరాటాలు చేయాలన్నారు. అనంతరం సత్తుపల్లి ఏరియా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా దారావత్ కృష్ణ, అమర్లపూడి శరత్, ఉపాధ్యక్షులుగా చింతం కృష్ణ, సూరిబాబు, సహాయ కార్యదర్శిగా బొడ్డా వెంకటేశ్వరరావు, దారావత్ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా రాములతో పాటు ఐదుగురితో నూతన కమిటీని ఎన్నుకోవటం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ నాయకులు నాగిరెడ్డి, రుద్రాక్షపల్లి గ్రామ కార్యదర్శి దుర్గ, రెడ్డి వెంకటేష్, హమాలీ సంఘం నాయకులు దారావత్ వెంకటేశ్వరరావు, శ్రీను, గరికె వెంకటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

వరల్డ్‌కప్ విజయోత్సవ ర్యాలీ


చింతకాని: లచ్చగూడెంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



కల్లూరురూరల్: చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రికెట్ అభిమానులు

చింతకాని/కల్లూరురూరల్: ఇండియా టీ 20 ప్రపంచ కప్ గెలుచుకున్న సందర్భంగా మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో, కల్లూరులోని చెన్నూరు గ్రామంలో యువకులు ఆదివారం బైక్ ర్యాలీని నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చెన్నూరులో థర్మకోల్‌తో వరల్డ్‌కప్ నమూనా తయారుచేసిన ఉపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ.. ప్రతీ ప్రంచకప్‌లో ఇండియా గెలవాలని ఆకాంక్షిస్తూ.. వరల్డ్‌కప్ నమూనాను తయారు చేస్తున్నానని తెలిపారు. ఇండియా జట్టు ఫైనల్ మ్యాచ్‌లో సమిష్టిగా రాణించి దక్షిణాఫ్రికాపై విజయం సాధించి ప్రపంచ కప్‌ను అందుకుందన్నారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని వరల్డ్‌కప్‌లు గెలవాలన్నారు. యువకులందరూ భారత్ జట్టు చూపిన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. బాణసంచాలను పేల్చి జాతీయ జెండాలతో గ్రామంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నురుకు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు కొడవటి నాగేశ్వరరావు, నాగరాజు, ఉపేందర్, వెంకట్రావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో రోజంతా వర్షం


కొణిజర్లలో ముసురుకు ఎర్రబారుతున్న పత్తి

కొణిజర్ల: మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. ఏ మాత్రం ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. వ్యవసాయానికి పెద్దగా ఉపకరించే వాన కానప్పటికీ మెట్ట పైర్లకు వర్షం వల్ల కొంత మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. గత కొద్ది రోజులుగా పగలంతా ఎండకాయడం సాయత్రం వర్షం కురుస్తుంది. వారం రోజులుగా ఓ మోస్తారు వానలు పడుతున్నా చెరువుల్లోకి కొత్త నీరు వచ్చి చేరలేదు. భారీ వర్షాలు కురిసి చెరువులు నిండుతాయనే ఆశతో రైతులు చెరువుల కింద వరి నార్లు పోసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు.

వర్షానికి రైతన్న హర్షం..

ముదిగొండ: ముదిగొండలో శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పత్తి విత్తిన రైతన్నలకు కాస్తా ఊరట లభించింది. 22.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఎంఈఓ రాధ తెలిపారు. ఈ వర్షం పత్తి మొక్కలకు జీవం పోసింది.

రాష్ట్రీయ రహదారిపై నేలకొరిగిన భారీ వృక్షం


వైరా-జగ్గయ్యపేట రాష్ట్రీయ రహదారిపై నేలకొరిగిన భారీ వృక్షం

వైరారూరల్: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి రెబ్బవరం గ్రామ సమీపంలో రహదారి పక్కన ఉన్న భారీ వృక్షం నేలకొరిగింది. దాంతో వాహనదారులకు తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా.. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందిండచంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు భారీ వృక్షాన్ని జేసీబీ సాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.